భ్రమ

నాన్నా! నీలవేణి అంటీ నిన్ను రమ్మంటున్నది!" అన్నాడు మావాడు రొప్పుతూ లోపలికి వస్తూ.

"ఎక్కడ? ఎక్కడుంది ఆంటీ?" అని అడిగాను నేను చదువుతున్న పేపరు పక్కన పడేసి.

"బయట... స్కూటర్ మీదనే ఉంది. దిగనైనాలేదు. లోపలికి రమ్మంటే రానంటున్నది!"

నేను గాబరాగా లేచి వాకిట్లోకి వచ్చాను.

స్కూటీ ఇంజను అప్పుడు ఆపింది నీలవేణి. మహాకోపంగా ఉన్నట్టు కనిపించింది.

"ఏమిటి?లోపలికెందుకు రావు?" అని అడిగాను.

"ఇప్పుడు టైమ్ లేదు. అర్జంటుగా వెళ్తున్నాను. ఒక్కమాట చెప్పిపోదామని ఆగాను. మీ ఫ్రెండు...అదే మీ మహా రచయితగాడు. వాణ్ణి గురించి!"

"ఏమిటది? ఏమైంది?" అన్నాను నేను ఆదుర్దాగా.

"ఏముంది? మామూలే... పిచ్చిచూపులు చూస్తున్నాడు. అసలు నన్ను చూసిన మొదటిలోనే అదేమిటోగా ప్రవర్తించాడు. వినబడకుండా ఏదో వాగాడు కూడా. వాడు డెప్యూటీ మేనేజర్, నేను క్లర్కును అయితే కావచ్చు. కానీ వెర్రిచూపులు చూస్తే వెర్రివేషాలు వేస్తే మాత్రం ఊరుకోను. తెలుసుగా నా సంగతి. మరోసారి ఏదైనా జరిగిందో మొహం పచ్చడి పచ్చడి అయిపోతుందని తెలుసుకోమను. నువ్వు వాడికి గొప్ప ఫానువు కదా? అందుకని నీకు ముందుగా చెబుతున్నాను. కాస్త కాఫీ ఇచ్చి ఒళ్లు దగ్గర పెట్టుకుని బతకమని చెప్పు. తర్వాత్తర్వాత విచారించీ లాభం ఉండదని కూడా చెప్పు. నేను వెళ్తాను. మళ్ళీ రేపు కలుస్తాను. వదినకు చెప్పు. రేపు వస్తానని.. "

ఇంత మాట్లాడి బండి స్టార్టు చేసి అంత వేగంగానూ, విసురుగానూ దూసుకుపోయింది.

"అమ్మబాబోయ్!" అనుకుంటూ మొహం తుడుచుకుంటూ ఇంట్లోకి వచ్చాను.

మా ఆవిడ గుమ్మం అవతల నడుంమ్మీద చెయ్యి వేసుకుని నవ్వుతూ నిలబడి ఉంది.

"ఏమంటున్నది మీ ఫెమినిస్టు చెల్లెమ్మ? ఎవరినో దులిపిపారేస్తున్నట్టుందే! ఏమిటి కథ?" అని అడిగింది.

నేను కూర్చున్నాను. వెంటనే ఏమీ మాట్లాడలేదు.

నీలవేణి నెలరోజుల కిందటే ఇక్కడికి బదిలీ అయి వచ్చింది. నాకు వరసకు చెల్లెలవుతుంది. మా బాబాయిగారి కూతురు. ఒక్కగానొక్క గారాలపట్టి. ఏదో పెద్ద

ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం. పుట్టింది ఇక్కడే అయినా పెరిగింది నార్త్‌లో – నాగపూర్‌లో. మా బాబాయి అక్కడ రైల్వేలో పెద్ద ఆఫీసరు. నీలవేణి కాక ఆయనకు మరో కొడుకు. వాడింకా ఏదో చదువుకుంటున్నాడు. ఈమెగారు పోస్టు గ్రాడ్యుయేట్ పూర్తి చేసి ఉద్యోగంలో చేరింది. వీర ఫెమినిస్టు... కరాటే ఫైటర్. 'పెళ్ళిపెటాకులు' వంటి మాటలు బొత్తిగా సరిపడవు. ఇంగ్లీష్ పత్రికలలో అడపాదడపా ఫెమినిస్టు వ్యాసాలు కాక కొద్దిగా ఇంగ్లీషు కవిత్వం కూడా రాస్తూ ఉంటుంది. చిన్నప్పుడే టెన్త్ చదువుతున్నప్పుడే ఒకప్పుడెవడో వెంటపడి ఏదో వాగాడని షూ హీల్‌తో మెరుపు వేగంతో వాడి మొహం పచ్చడి చేసింది. ఏ విషయం మీద సంభాషణ మొదలుపెట్టినా క్షణాలలోనే ముందు భారత స్త్రీల (దు) స్థితిగతుల గురించీ, వారిలో అణువణువునా వ్యాపించిఉన్న బానిస మనస్తత్వాన్ని గురించీ, స్త్రీకి స్త్రీయే శత్రువు అనే విషయం గురించీ, ఆపైన పురుషాధిపత్యం గురించీ, పురుషాహంకారం గురించీ, తరతరాలుగా భారత స్త్రీకి జరిగిన, జరుగుతున్న దారుణ అన్యాయాన్ని గురించీ గుక్కతిప్పుకోకుండా, ఎదుటివారిని గుక్కతిప్పుకోనివ్వకుండా గరంగరంగా అమితోద్రేకంతో గలగలా మాట్లాడేస్తుంది. చివరకు 'ఇంకానా? ఇకపై సాగదు?వంటి స్లోగన్‌తో ముక్తాయింపు ఇస్తుంది. వింటూ ఉంటే నాకు మహా ముచ్చటగా ఉంటుంది.

మా ఆవిడకు నా మౌనం నచ్చలేదు.

"సంగతేమిటని అడిగితే బెల్లంకొట్టిన రాయిలా బదులు పలకరేం?" అన్నది పెద్దగా.

నేను ఇహంలోకి వచ్చి, "ఆఁ, చెల్లెమ్మే మాట్లాడింది!" అన్నాను.

"అదే, నే అడుగుతున్నది. "ఏం మాట్లాడిందీ?" అని... అయినా ఆ విసురు ఆ వాలకం చూస్తే మామూలు మాట్లాడటం లాగా లేదు. ఎవరినో దులిపి ఆరేస్తున్నట్టున్నది మరి...!"

"అవును, రంగనాయకులుగారు లేదూ... వాళ్ల కంపెనీలో డిప్యూటీ మేనేజరు... రచయిత... ఆయన్ను గురించి!"

"ఆయన్ను గురించా? మనింటికొస్తూఉంటాడు అప్పుడప్పుడూ... చాలా పెద్దమనిషే... మర్యాదస్తుడూను... ఆయనమీద కారాలు మిరియాలు నూరడమెందుకు ఈమెగారు?"

"అదే చిత్రంగా ఉంది. నాకేమీ అర్థం కావడంలేదు. ఆయన తనను చూసి వెర్రి వేషాలు వేస్తున్నాడంటుంది!" "ఏమీ వివరించి చెప్పలేదనుకో, అయినా వెర్రివేషాలంటే అదోలాగాచూడటమూ, అదోలాగా మాట్లాడటమూ, కావాలని తాకడమూ, ఏ కాయితాలందుకునేటప్పుడో ఇచ్చేటప్పుడో వేళ్లు తగిలించడమూ ఇలాంటివి కావచ్చు. కాకపోతే పిచ్చిరాతలతో కూడిన ప్రేమలేఖలు రాయడం కావచ్చు. ఇంకేమైనా కావచ్చు...!"

"ఇప్పుడేమంటుందీవిడ?"

"నేను రంగనాయకులుగారికి వార్నింగ్ ఇవ్వాలిట. ముందు ముందు ఏమైనా జరిగితే బొత్తిగా బాగుండదని హెచ్చరించమన్నది!"

"మొహం... పచ్చడి... అంటూ ఏదో వినిపించిందే నాకు!" అని నవ్వింది మా ఆవిడ.

"నువ్వు నోరుమూసుకుందూ! అసలే ఇలాటి గొడవలో ఇరుక్కున్నానే అని నేను బెంగపడుతూ ఉంటే మధ్యలో నువ్వు హాస్యరసం పిండుతావేమిటి?"

మా ఆవిడ మళ్లీ గలగల నవ్వింది.

"హాస్యరసం పుష్కలంగా పండే సన్నివేశమే ఇది. చూడాలి మరి.. మీరెలానెగ్గుకొస్తారో!"

నీలవేణితో ఇబ్బందే. ఆ తీవ్రత చూస్తుంటే భయం వేస్తున్నది నాకు. పోనీ రంగనాయకులుగారితో మాట్లాడదామంటే ఎలా మాట్లాడాలో తెలియడంలేదు. చాలా సున్నితమైన విషయం ఇది. అసలు మాట్లాడకుండా దాటవేద్దామంటేనూ కష్టమే. ఏక్షణంలోనైనా ఏ ప్రమాదమైనా జరిగిపోవచ్చు. అందువల్ల ఆయనతో మాట్లాడటమే మంచిది. ఏదో విధంగా జాగ్రత్తగా ప్రసంగం తెచ్చి ఆయనకు పరిస్థితి త్రీవతను తెలియజేయడమే మంచిది. నీలవేణి నాకు చెల్లెలని ఆయనకు ముందే తెలుసు. ఆమెను గురించి కొన్ని వివరాలు మాత్రం చెబితే విషయం ఆయన గ్రహించగలడు. చిన్నప్పటినుంచీ దాని భావాలు వేరనీ, తీవ్రస్వభావి అనీ, తొందరపాటు కొంచెం ఎక్కువ అనీ ఇలా మొదలుపెట్టి నాలుగు మాటలు మాట్లాడితే ఆయనకే తెలిసివస్తుంది. తర్వాత కొంచెం కాషస్‌గా ఉంటాడు. లోపల ఏవైనా అనారోగ్యకరమైన ఆలోచనలు ఉన్నా, తొందరపడకుండా జాగ్రత్తగా ఉంటాడు. భార్యపోయి నాలుగేళ్లు కావస్తున్నా మళ్లీ పెళ్లీ ఊసెత్తకుండా కేవలం ఉద్యోగంతో, రచనా వ్యాసంగంతో, సాహిత్య పఠనంతోనే కాలం గడుపుతూ వస్తున్నాడు. నలుగురితో మంచివాడుగా పెద్దమనిషిగా గుర్తింపుపొందిన మనిషి, ఆ మాత్రం అర్థం చేసుకుని తన జాగ్రత్తలో తాను ఉండకపోతాడా?

ఆనాడు సాయంకాలం నేను బయటికి వెళ్ళేందుకు తయారై బయలుదేరబోతుండగా ఆశ్చర్యకరంగా ఆయనే మా ఇంటికి వచ్చాడు - "హలో! ఎలా ఉన్నారు!" అని పలకరిస్తూ.

మనిషి ఆజానుబాహువు. పచ్చని శరీరఛాయ. గుండ్రని ముఖం, పలుచని అద్దాలు... నిరంతరం మెరిసే చిరునవ్వు.

"మీరా! రండి, రండి!" అన్నాను కుర్చీ జరుపుతూ.

ఆయన కూర్చొని కళ్లజోడు తీసి రుమాలుతో ముఖం తుడుచుకుని మళ్ళీ కళ్లజోడు పెట్టుకున్నాడు.

"ఇవాళ ఆఫీసుకు సెలవుపెట్టాను. చిన్నచిన్న పనులుండిపోయాయి. మీరు గుర్తొచ్చారు!" అన్నాడు.

నేను లోపల్లోపల కంగారు పడుతూనే ఉన్నాను. కళ్లముందు నీలవేణి ఆకృతి మెదలుతున్నది. పకడ్బందీగా కరాటే నేర్చిన పిల్ల. అయిదారు ఇటుకలను వరుసగా పేర్చి ఒక్క చేతివేటితో బద్దలుచేయగల హస్తబలం ఆమెది. ఈయనేమో నాజుగ్గా ఉన్నాడు.

ఆయన కుర్చీలో ఎందుకో అసహనంగా కదులుతున్నాడు. ఏదో చెప్పాలనీ, లేక ఏదో అడగాలనీ ప్రయత్నిస్తున్నాడు.

నా కళ్లముందు అంతలో ఒక భయానక దృశ్యం.

ఆయన అందమైన ముఖం బద్దలు బద్దలై రక్తసిక్తమైన ఎర్రని మాంసపు ముద్దలాగున...

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను.

ఆయన ఏమండీ!మిమ్మల్నే...! ఏ లోకంలో ఉన్నారు?" అంటున్నాడు.

నేను ప్రస్తుతంలోకి వచ్చి, 'మీకు టీ తెప్పిస్తాను!" అంటూ లేచాను.

"ఇప్పుడేమీ వద్దు, ఉండండి!" అంటున్నా వినిపించుకోకుండా పెద్ద పెద్ద అంగలతో లోపలికి వెళ్ళాను. 'ఇవాళ డ్యూటీ లేకుండా ఇట్లా ఇంట్లో ఎందుకుంచావురా పాపిష్టి దేవుడా!' అనుకుంటున్నాను.

మా ఆవిడ అంతకుముందే ముందు గదిలోకి వచ్చి, తొంగి చూసి వెళ్ళినట్టు ఉంది. టీ సిద్ధం చేసి కప్పులో పోస్తూ నెమ్మదిగా "ఆ శాల్తీయేనా?" అని అడిగింది.

"అవును" అన్నాను.

"పాపం!" అన్నది అదో రకంగా నవ్వుతూ.

"ఏం రాసిపెట్టి ఉందో ఆయన మొహాన...!" అని కూడా అన్నది కప్పు అందిస్తూ.

నేను ముందు గదిలోకి వెళ్లి ఆయనకు టీ అందించాను.

ఆయన "ఇప్పుడిదంతా ఎందుకండీ?" అంటూనే అందుకున్నాడు.

ఆ తర్వాత ఇద్దరం నిశ్శబ్దంగా టీ సేవించాము.

కప్పు కుర్చీ పక్కన నేలమీద ఉంచి, ఆయన చేతి వేళ్లు విరుచుకున్నాడు. తర్వాత అరచేత్తో నుదురు తుడుచుకున్నాడు.

ఒక్కసారి దగ్గి, "నీలవేణి... అదే... మా ఆఫీసులో పనిచేసే అమ్మాయి, మీ సిస్టర్ కదూ! " అన్నాడు.

"అవును, మా పినతండ్రిగారి అమ్మాయి. నాగపూర్‌లో చదువుకుంది. చాలా స్పీడ్ మనిషి., కరాటే ఛాంపియన్... అయిదారు ఇటుకులను ఒక్క దెబ్బతో ముక్కలు చేసేస్తుంది. అన్యాయం సహించదు. ఒకప్పుడు ఎవడో ఏదో అన్నాడని వాణ్ణి చావగొట్టింది!" అనేశాను. గబగబా.

"చాలా మంచి పిల్ల!" అన్నాడాయన. ఆ తర్వాత మళ్లీ చేతి వేళ్ళు విరుచుకుని, 'ఒకచిన్న రిక్వెస్టు!" అన్నాడు.

"చెప్పండి!" అన్నాను అనుమానిస్తూనే.

"ఏం లేదు రేపు ఆదివారం కదా! మధ్యాహ్నం పూట ఒక్కసారి మా ఇంటికి రావాలి మీరు!"

"దానికేం? అట్లానే వస్తాను!" అన్నాను.

"మీరొక్కరే కాదు, మీ చెల్లెమ్మను కూడా తీసుకురావాలి!"

నేను ఖంగుతిన్నాను!"

నీళ్లు నములుతూ, '.ఏమో, నీల ఏమంటుందో, ఏమో!" అంటున్నాను.

"చెప్పి చూడండి, ఎంతయినా బాస్‌ను కదా! కాదునదులెండి. మా ఇంట్లో పనిమనిషి, వంటమనిషి తప్ప ఎవరూ ఉండరు. నేను ఆఫీసూ, ఇల్లు తప్ప మరేమీ ఎరగను. పుస్తకాలే స్నేహితులు. మా ఆవిడ పోయినప్పటినుంచి ఒంటరి బతుకయి పోయింది. నీలవేణిని చూశా..." అంటూ అకస్మాత్తుగా ఆగిపోయాడు. కళ్లు చెమర్చాయి.

తర్వాత లేచి, "వెళ్లొస్తాను. మీకోసం ఎదురు చూస్తూ ఉంటాను. తప్పక రండి!" అంటూ గబగబా నడుచుకుంటూ, వరండా దాటి మెట్లు దిగి వెళ్లి పోయాడు.

"సరే, తప్పేదేముంది?" అనుకుంటూ లేచి వెళ్లి షర్టు తొడుక్కుని, లుంగీతోనే వీధి చివర ఉన్న టెలిఫోన్ బూతుకు వెళ్లి నీలవేణి ఆఫీసుకు ఫోన్ చేశాను. రిసెప్షనిస్టుతో "నీలవేణిగారితో మాట్లాడాలి. వాళ్ల అన్నయ్యనని చెప్పండి!" అన్నాను.

"హలో!" అన్నది నీలవేణి.

"అమ్మాయి! నేను..."

"చెప్పు, అన్నయ్య! ఏమిటి సంగతి? ఇవాళ మీ రచయిత ఫ్రెండుగారు సెలవుమీద ఉన్నాడు!" అన్నది.

"అదే చెబుతున్నాను. ఆయన మా యింటికి వచ్చాడు."

"వొచ్చి?"

"వొచ్చి కాసేపు కూర్చున్నాడు".

"కూర్చుని...?"

"నేనిచ్చిన టీ తాగాడు."

"తాగి?"

"రేపు ఆదివారం కదా! మధ్యాహ్నం వాళ్ల ఇంటికి ఆహ్వానించాడు."

"అంతేనా? అయితే వెళ్లు!"

"అంతే నా కాదు. నే ఒక్కణ్ణే కాదుట. నువ్వు కూడా రావాలిట!"

"ఆఁ ఆలాగా ఇంకేమన్నాడు?"

నేను కొంచెం సంకోచిస్తూ, "ఇంకా ఏమన్నాడంటే.....నువ్వు చాలా మంచిపిల్లవని అన్నాడు!"

"అలా అన్నాడా?" అన్నది ఆశ్చర్యంగా.

ఒక్క క్షణం ఆగి, సరే వెళ్దాం!" అని ఫోన్ పెట్టేసింది.

మరునాడు మధ్యాహ్నం సిద్ధమై కూర్చుని ఉండగా వచ్చింది. హడావిడిగా "పోదాం, పద!" అంటూ.

ఆమె వెనక స్కూటీ మీద కూర్చున్నాను. మహా స్పీడుగా బండి నడిపింది. ఏదో మాట్లాడుతూనే ఉంది. కానీ గాలి విసురుకు కాస్త కాస్త తప్ప ఏమీవినిపించలేదు నాకు.

ఆ ఇల్లు చిన్నదే అయినా చాలా ముచ్చటగా, అందంగా ఉంటుంది. ముందు ఖాళీ స్థలం. పూల మొక్కలు... లోపల ముందు గదిలో చుట్టూ అద్దాల బీరువాలలో పుస్తకాలే పుస్తకాలు... గది అంతటా సాహిత్య వాసన...

పనిమనిషి కాబోలు యాభై ఏళ్లు పై బడిన ఒకావిడ మమ్మల్ని కూర్చోబెట్టింది. "అయ్యగారు వస్తారిప్పుడే...!" అని లోపలికి వెళ్లింది.

నీలవేణి మాత్రం కూర్చోకుండా చుట్టూ తిరుగుతూ పుస్తకాలు చూస్తున్నది.

నేను సోఫాలో కూలబడి ఎదురుగా టీపాయ్ మీద ఉన్న ఒకే ఒక్క ఫోటో ఆల్బం చేతిలోకి తీసుకుని. "ఇదొక్కటీ ఎందుకుంది ఇక్కడ?" అనుకుంటూనే తెరిచాను. క్రమంగా నా కళ్లు పెద్దవైనాయి. పేజీలు తిప్పుతున్నకొద్దీ ఆశ్చర్యంతో కొయ్యబారిపోయాను.

"ఆ చిన్న అరలో ఉన్నవన్నీ ఆయనగారి రచనల్లాగున్నాయే!" అంటూ నీలవేణి వచ్చి కూర్చుంది.

నేను ఆల్బం అందించి, "చూడు!" అన్నాను.

ఫోటోలు చూడటం ఆరంభించి ఆమె నివ్వెరపోయింది. అన్నీ నీలవేణి ఫోటోలే... ఏ భంగిమలో చూసినా నీలవేణి... లేశమైనా తేడా లేకుండా అంతటా నీలవేణి...

లోపలనుంచి ట్రేలో డ్రింకులు తెచ్చి టీపాయ్ మీద ఉంచి, "తీసుకోండి" అన్నదావిడ.

అంతలో రంగనాయకులుగారు బయటినుంచి లోపలికి వచ్చాడు.

"అరె,వచ్చేశారా? నేను ఫోన్ చేసి వద్దామని వెళ్లాను!" అన్నాడు.

నేను "ఈఫోటోలు..." అంటున్నాను.

"మీరు చూస్తారనే ఉంచానక్కడ!" అన్నాడు. ఆయన కళ్లు చెమర్చాయి.

"మా అమ్మాయి.... పేరు పూజ!" అన్నాడు క్లుప్తంగా. ఆ తర్వాత, "ఇప్పుడే వస్తాను. ఆ డ్రింకు తీసుకోండి!" అంటూ లోపలికి వెళ్లాడు.

నీలవేణి వంక చూశాను. ఆమె నిట్టూర్చింది. పాపం, ఎప్పుడు పోయిందో!" అన్నది మెల్లగా.

నేను మొదలుపెట్టాను. "నిన్ను చూస్తే చచ్చిపోయిన కుమార్తె గుర్తొచ్చి ఉంటుంది. అందుకే అలా చూశాడు. అలా మాట్లాడాడు. నువ్వేమో ఆయన్ను అపార్థం చేసుకుని మొహమూ... పచ్చడీ... అంటూ చిర్రుబుర్రులాడావు."

ఆయన దుస్తులు మార్చుకుని వచ్చి మా ముందు కూర్చున్నాడు.

నేను కాస్త ఇబ్బంది పడుతూనే - "చూశారూ! ఈ ఫోటోల్లో ఉన్న మీ అమ్మాయి అచ్చం మా నీలవేణి లాగా ఉంది ఎలా చూసినా! అందువల్ల నీలవేణిని చూడగానే మీ అమ్మాయే గుర్తుకు వచ్చి ఉంటుంది మీకు!" అంటున్నాను.

ఆయన కళ్లార్పకుండా మా వంకనే చూస్తున్నాడు.

"ఇంతకీ ఎన్నాళ్లయింది మీ అమ్మాయి చనిపోయి?" అని అడిగాను.

"అదేమిటి? మా అమ్మాయి పోవడమేమిటి? కెనడాలో నిక్షేపంగా మొగుడితో పాటు మెడిసిన్ ప్రాక్టీస్ చేస్తున్నది... ఫోనులో మాట్లాడి వస్తున్నానిప్పుడే... అచ్చం నీలాంటి అమ్మాయే మా ఆఫీసులో పనిచేస్తున్నదని చెప్పి వస్తున్నాను!" అన్నాడాయన గొంతు పెంచి...

♦ ♦ ♦